సాక్షి తిరుపతి

శుక్రవారం । 2 । ఆగస్టు । 2024



ఫోన్ పే కొట్టు.. సీటు పట్టు !

సత్యవేడు ఎస్సీ బాలికల గురుకుల కళాశాలలో సీట్లు విక్రయిస్తున్నారన్న సమాచారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. - 8లో



పోలీస్‌శాఖలో హోంగార్డు కీలకం

పోలీసు శాఖలో హోంగార్డు కీలకమని రాయలసీమ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్ కుమార్ తెలిపారు. - 8లో



బండరాయిని ఢీకొన్న బస్సు

బండరాయిని కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు. మరో 17 మందికి స్వల్ప గాయాలయ్యాయి. - 8లో

న్యూస్‌రీల్

టీటీడీ విద్యాసంస్థల గౌరవాన్ని పెంచుతాం



ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కమిటీ

తిరుపతి సిటీ: టీటీడీ విద్యాసంస్థల గౌరవాన్ని పెంచేందుకు తమ వంతు కృషి చేస్తామని టీటీడీ డిగ్రీ కళాశాలల టీచర్స్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. గురువారం ఎస్వీ ఆర్ట్స్ కళాశాల వేదికగా టీటీడీ డిగ్రీ కళాశాలల టీచర్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ అధ్యాపకుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని, విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకులుగా తమ బాధ్యతలను నిర్వహిస్తామన్నారు. నూతన అసోసియేషన్ గౌరవాధ్యక్షులుగా డాక్టర్ పి.భాస్కరుడు, అధ్యక్షులుగా డాక్టర్ పీవీ చలపతి, ప్రధాన కార్యదర్శిగా ఈ రామకృష్ణారెడ్డి, కోశాధికారిగా సి.దివ్యవాణి, ఉపాధ్యక్షులుగా మాధన్న, సహాయ కార్యదర్శులుగా డాక్టర్ ఏ విద్యుల్లత, పి ఉదయ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కామేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

5 వరకు డిగ్రీ వెబ్ ఆప్షన్లకు అవకాశం

తిరుపతి సిటీ: టీటీడీ విద్యాసంస్థలతో పాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ బుధవారంతో ముగిసింది. ఓఏఎమ్‌డీసీ వెబ్‌సైట్ ద్వారా గురువారం నుంచి ఈ నెల 5వ తేదీ వరకు విద్యార్థులు తమకు నచ్చిన కాలేజ్‌లో ఆసక్తిగల కోర్సు కోసం వెబ్‌ఆప్షన్లను ఎంపిక చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. 6వ తేదీన ఆప్షన్ల మార్పునకు అవకాశం కల్పిస్తూ, 10వ తేదీ సీట్ల కేటాయింపు ప్రక్రియను చేపట్టనుంది. ఈ నెల 12వ తేదీ నుంచి సీట్లు కేటాయించిన కళాశాలల్లో విద్యార్థులు అడ్మిషన్లు పొంది, అదే రోజున తరగతులకు హాజరు కావాల్సి ఉంటుంది.

10న పోస్టర్ పెయింటింగ్ పోటీలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కేంద్రం కో- ఆర్డినేటర్ శ్రీనివాస ప్రసాద్

తిరుపతి(అలిపిరి): స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రీజనల్ సైన్సు సెంటర్, వే ఫౌండేషన్, తిరుపతి అండ్ సేవ్ సాయిల్ సహకారంతో ఈనెల 10వ తేదీ ఉదయం 10.30 గంటలకు విద్యార్థులకు పోస్టర్ పెయింటింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ తెలిపారు. 2 నుంచి 10వ తరగతి విద్యార్థులు ఇందులో పాల్గొనవచ్చన్నారు. ఈ నెల 11న ఉదయం 10.30 గంటలకు భారత దేశ సంస్కృతి, సైన్స్, శాస్త్రవేత్తలు, భారత స్వాతంత్య్ర సమరయోధుల వస్త్రధారణ (ఫ్యాన్సీ డ్రెస్) పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఎల్‌కేజీ నుంచి ఒకటో తరగతి వరకు చిన్నారులు ఇందులో పాల్గొనవచ్చన్నారు. విజేతలకు స్వాతంత్య్ర దినోత్సవం రోజున బహుమతుల ప్రదానం ఉంటుందని వివరించారు. స్వాతంత్య్ర సమరయోధుల వస్త్రధారణ పోటీల్లో పాల్గొనే విద్యార్థుల పేర్లను వెబ్‌సైట్ http://tinyurl.com/RSCT fancydress లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పైడి అంకయ్య(వే ఫౌండేషన్), డాక్టర్ కిషోర్ (సేవ్ సాయిల్) తదితరులు పాల్గొన్నారు.

హద్దు మీరి.. మీనం చోరీ!

సాఫీగా సాగుతున్న మత్స్యకారుల జీవన 'కడలి'ని తమిళ జాలర్లు తీవ్ర ఆటుపోట్లకు గురి చేస్తున్నారు. స్పీడు బోట్లతో సరిహద్దు దాటి ఆంధ్రా జలాల్లోకి చొరబడుతున్నారు. తీర సమీపాన చేరి చేపల వేట సాగిస్తున్నారు. దీన్ని ప్రశ్నించిన స్థానిక మత్స్యకారులపై దాడులు చేస్తున్నారు. బోట్లను ధ్వంసం చేస్తున్నారు. అందుబాటులో ఉన్న మత్స్యసంపదను దోచుకుపోతున్నారు. ఫలితంగా ఆంధ్రా జాలర్లు మీనం కోసం సుదూర ప్రయాణం సాగిస్తున్నారు. వారాల పాటు నడి సంద్రంలో నిరీక్షిస్తున్నారు. అలలపై వేటలో అలసిపోతున్నారు. ఈ ఆకలి పోరాటంలో మునిగిపోతున్న జీవన నావను ఒడ్డుకు చేర్చే ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు.



సముద్రంలోకి చేపల వేటకు వెళుతున్న జాలర్లు

- ఆంధ్రా జలాల్లో తమిళ జాలర్ల వేట
- స్థానిక మత్స్యకారులపై దాడులు
- సాగరంలో పెచ్చుమీరుతున్న చొరబాట్లు
- మత్స్యసంపదను దోచేస్తున్న స్పీడు బోట్లు

వాకాడు/ చిల్లకూరు : తరతరాల నుంచి కడలిని నమ్ముకుని బతుకుతున్న జాలర్లకు తమిళ రాష్ట్రాల మత్స్యకారుల నుంచి సమస్యలు ఎదురవుతున్నాయి. సంప్రదాయ మత్స్యకారుల జీవనం కడలిపైనే సాగుతుంది. నిద్ర లేచింది మొదలు వేట సామగ్రితో బోట్లు బయల్దేరుతాయి. మత్స్య సంపద దొరికే వరకు వారాలపాటు సముద్రం పైనే వేట సాగుతుంది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. అనుకోని రీతిలో తమిళనాడుకు చెందిన జాలర్ల నుంచి వీరికి జీవన్మరణ సమస్య ఎదురవుతోంది.

జిల్లాలో మత్స్యకారుల వివరాలు

జిల్లాలోని 5 తీర ప్రాంత మండలాల్లో 75 కిలోమీటర్ల పొడవున బంగాళాఖాతం సముద్ర తీరం విస్తరించి ఉంది. అందులో వాకాడు, కోట, చిల్లకూరు, తడ, సూళ్లూరుపేట మండలాలు ఉన్నాయి. ఈ మండలాల పరిధిలో 42 మత్స్యకార గ్రామాలు ఉండగా అందులో 70 వేల మంది మత్స్యకార జనాభా ఉన్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం సముద్రంపై వేట సాగించే మత్స్యకారులు 3,647 మంది ఉండగా వీరికి 853 బోట్లు ఉన్నాయి. 31 ఫిష్ లాండ్స్ ఉన్నాయి. మూడు చోట్ల సముద్రపు ముఖ ద్వారాలు ఉన్నాయి. సాధారణ వల వేటలో ముగ్గురు, రింగు వల వేటకు ఏడుగురు, వంజిరం వల వేటకు 10 మంది మత్స్యకారులు వేటకు బయలుదేరుతారు. బయలు దేరిన బోట్లు సుమారు 5 నాటికల్ మైళ్ల నుంచి 13 నాటికల్ మైళ్ల దూరం వరకు సముద్రం లోపలికి వెళ్లి వేట కొనసాగిస్తాయి. ఏడాదిలో వేట నిషేధం రెండు నెలలు పోను మిగిలిన 10 నెలల్లో జిల్లా మత్స్యకారులు 82 వేల టన్నుల మత్స్య సంపదను సేకరిస్తారు. తద్వారా రూ.1.5 కోట్ల ఆదాయం వస్తుంది. అలాంటిది పొరుగు రాష్ట్రాల దోపిడీ కారణంగా జిల్లా మత్స్యకారులు ఏటా తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రస్తుతం ప్రాణాలను పణంగా పెట్టి రోజులు తరబడి వేటాడినా తగినంత మత్స్య సంపద దొరకడం లేదు. మత్స్యకారులకు పూట గడవని పరిస్థితి ఎదురవుతోంది.

పార్లమెంట్‌లో గళమెత్తిన ఎంపీ



ఎంపీ గురుమూర్తి

హద్దుల విషయంపై పార్లమెంటులో తిరుపతి ఎంపీ గురుమూర్తి తిరుపతి జిల్లాలోని మత్స్యకారుల అగచాట్లపై గళం విప్పారు. పక్క రాష్ట్రాల మత్స్యకారులు సాగిస్తున్న దాడులను ప్రస్తావించారు. ఎట్టి పరిస్థితుల్లో తమిళ జాలర్ల చొరబాట్లను అరికట్టాలని డిమాండ్ చేశారు. దీనికి అవసరమైన చర్యలను యుద్ధ ప్రాతిపదికన తీసుకోవాలని కోరారు. తద్వారా ఆంధ్రా మత్స్యకారుల జీవనోపాధిని కాపాడాలని పేర్కొన్నారు. అయితే దీనిపై చర్యలు తీసుకుంటామని చెప్పారే కానీ పరిష్కారం మాత్రం చూపలేదు. ఇకనైనా రెండు రాష్ట్రాల ప్రభుత్వాలతో పాటుగా కేంద్రం జోక్యం చేసుకుని ఆంధ్ర జాలర్లకు తమిళనాడు మత్స్యకారుల నుంచి రక్షణ కల్పించాలి.



సముద్రంలో 10 రోజుల పాటు వేటాడిన ఆంధ్రా మత్స్యకారులకు దొరికిన చిన్న చేపలు



సరిహద్దు దాటి వచ్చి చేపలను వేటాడుతున్న తమిళనాడు స్టీమ్ బోట్లు

చొరబడి.. వేటాడి..

మత్స్యకారులు నిబంధనల ప్రకారం చిన్న బోట్లతో తీరం నుంచి సముద్రంలో 13 నాటికల్ మైళ్ల దూరం వరకు రింగు వలతో వేటాడుకోవాలి. పెద్ద స్పీడు బోట్లు వినియోగించేవారు 15 నాటికల్ మైళ్ల దూరం వెళ్లాలి. అక్కడ పెద్ద కంతలు అంటే 4 నుంచి 6 అంగుళాల సైజు కల్గిన కంతల వలతో వేటాడాలి. అయితే ఈ నిబంధనలను బేఖాతర్ చేస్తూ కడలూరు, పాండిచ్చేరి ప్రాంతాలకు చెందిన జాలర్లు ఆంధ్రా తీరం వరకు వచ్చి సన్న కంతల వలతో చిన్న సైజు చేపలనూ దోచుకుపోతున్నారు. ఇదేమి అన్యాయమంటూ ప్రశ్నించిన స్థానిక మత్స్యకారులపై దాడులకు తెగబడుతున్నారు. ఇలా ఇప్పటివరకు 52 సార్లు దాడులు చేశారు. తమిళ జాలర్ల దాడుల్లో దాదాపు 102 మందికిపైగా మత్స్యకారులు గాయపడ్డారు. ఈ దాడులపై విసిగిపోయిన జిల్లా మత్స్యకారులు పలుమార్లు తిరగబడ్డారు. దొరికిన వారిని పట్టుకుని నిర్బంధించారు. అప్పుడు మాత్రం ఇరు రాష్ట్రాల మత్స్యశాఖ అధికారులు కలిసి వచ్చి చర్చలు జరిపి వారిని విడిపించుకుని వెళ్లిపోతారు. ఆ తరువాత మళ్లీ మామూలే.



తమిళనాడు స్టీమ్ బోట్లలో ఉన్న పెద్ద వలల స్టాండ్లు

మా బోట్లు ధ్వంసం చేస్తున్నారు



తమిళనాడుకు చెందిన కొంత మంది జాలర్లు సముద్రంలోని ఆంధ్ర జలాల్లోకి దూసుకొస్తున్నారు. ఇక్కడి జలాల్లో 7నాటికల్ మైళ్ల దాటి వచ్చి పెద్ద వలలతో వేటాడుతున్నారు. వారు ఒక్క సారి వల వేస్తే నాచుతో పాటుగా చిన్న, పెద్ద చేపలు పూర్తిగా తుడిచి పెట్టుకుని వచ్చేస్తాయి. పలు మార్లు తమిళనాడు బోట్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తే వారు బోట్లలో తెచ్చుకున్న రాళ్లు, కర్రలు, రాడ్లతో దాడులు చేశారు. పెద్ద బోట్లతో మా బోట్లను ధ్వంసం చేస్తున్నారు.

– మేకల నాగరాజు,
మోమిడి, చిల్లకూరు మండలం

మాపై దాడులు ఆపాలి



పొరుగు రాష్ట్రాలకు చెందిన మత్స్యకారులు స్పీడు బోట్లతో వచ్చి ఇక్కడి సంపదను దోచుకుపోతున్నారు. మేము ఏమైనా అడిగితే మాపై దాడులు చేస్తున్నారు. ఈ దాడుల నుంచి మాకు విముక్తి కల్పించేలా శాశ్వత పరిష్కారం చూపాలి. గత ఇరవై ఏళ్లుగా వారు మమ్మల్ని నానా ఇబ్బందులు పెడుతూనే ఉన్నారు. ఇక్కడున్న మత్స్య సంపదంతా దోచుకుపోతున్నారు. తరతరాలుగా తాము వేటపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాము. అధికారులు తమిళ జాలర్లను అడ్డుకుని మాకు న్యాయం చేయాలి.

– సోమయ్య, మత్స్యకారుడు, తూపిలిపాళెం

చర్చలు జరిపినా అదే తీరు



జిల్లాలోని చిల్లకూరు, కోట, వాకాడు, సూళ్లూరుపేట, తడ ప్రాంతాల్లోని అన్ని మత్స్యకార గ్రామాల్లోనూ తమిళ జాలర్ల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. తమిళబోట్లను అడ్డుకోవాలని ఎప్పటికప్పుడు అధికారులకు, పాలకులకు విన్నవిస్తూనే ఉన్నాం. గొడవ జరిగినప్పుడు, వాళ్లను బంధించినప్పుడు మాత్రం వచ్చి చర్చలు జరుపుతారు. సరిగ్గ పది రోజుల తరువాత మళ్లీ తమిళ జాలర్లు స్టీమ్ బోట్లతో విరుచుకుపడతారు. దీనిపై చర్యలు తీసుకుని వారు హద్దులు దాటకుండా చూడాలి.

– కోడి నరసింహులు,
మత్స్యకార నాయకులు, చిల్లకూరు మండలం

ఎన్నో సార్లు దాడులు చేశారు



మా గ్రామానికి చెందిన జాలర్లపై ఎన్నో సార్లు తమిళనాడు జాలర్లు దాడులు చేశారు. ఇక్కడి బోట్లను ధ్వంసం చేశారు. పెద్ద వలలు విసిరి చిన్న చేపలతో సహా పట్టుకుపోయారు. దీనిపై అధికారులకు చెబుతూనే ఉన్నాం. అందరూ వచ్చి అప్పటికప్పుడు పరిష్కారం చేసి పంపేస్తున్నారు. కానీ తమిళ జాలర్ల చొరబాట్లను అడ్డుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో వారు యథాప్రకారం చొరబడుతూనే ఉన్నారు.

– ఆర్కేటి మహీంద్ర, తూపిలిపాళెం

ప్రజాస్వామ్యానికి ఘోరీ కట్టిన కూటమి ప్రభుత్వం

- మాజీ డెప్యూటీ సీఎం నారాయణస్వామి



మాట్లాడుతున్న నారాయణస్వామి

తిరుపతి కల్చరల్: అధికారం చేపట్టిన క్షణం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడడమే కాక, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తూ.. టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి ఘోరీ కట్టిందని మాజీ ఉప ముఖ్యమంత్రి కె. నారాయణ స్వామి మండిపడ్డారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, దీన్ని ఆసరా చేసుకుని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలపై దాడులు చేయడం ప్రజాస్వామ్యం అంటారా అని సీఎం చంద్రబాబును ప్రశ్నించారు. మదనపల్లె ఆర్డీవో ఆఫీసులో రికార్డులు తగులబెట్టి.. ఆ నెపం తమపైకి నెట్టారన్నారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. పేదలను ఆశల పల్లకిలో ఊరేగించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేనని అసెంబ్లీ సాక్షిగా చేతులెత్తేయడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనంగా నిలుస్తుందని ధ్వజమెత్తారు. నిరుపేద వర్గాలు చదువు ద్వారా సమాజంలో ఉన్నత స్థానంలో ఉండాలనే కాంక్షతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో సైతం ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. అంబేడ్కర్ ఆశయాల సాధన కోసం జగన్ నిరంతరం కృషి చేశారన్నారు. పేదలకు సొంతింటి కలను నేరవేర్చడం, ఉన్నత విద్యతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు ఆరోగ్యశ్రీ పథకాలతో పాటు నవరత్నాలను అమలు చేసి పేదల జీవన ప్రమాణ స్థాయిని పెంచేందుకు జగన్ అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. చంద్రబాబు ప్రజలను ఏమార్చి.. పలు రకాల మోసాలకు పాల్పడి అధికారంలోకి వచ్చారని అన్నారు. బాబు సామాజిక వర్గాన్ని కాపాడుకోవడానికే అమరావతి పాట పాడుతున్నారని ఎద్దేవా చేశారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 10 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 67,916 మంది స్వామివారిని దర్శించుకోగా 23,010 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి హుండీ కానుకలు రూ.4.58 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టోకెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. జూలైలో భక్తులు శ్రీవారి హుండీలో రూ.125 కోట్ల కానుకలు సమర్పించారు. ఈ ఏడాది జూలై నెల ఆదాయమే అత్యధికం.

బడిలో కలెక్టర్ భోజనం



విద్యార్థినులతో కలసి భోజనం చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కలెక్టర్ వెంకటేశ్వర్ సహపంక్తి భోజనం చేశారు. ఆయన పట్టణంలో గురువారం సుడిగాలి పర్యటన చేశారు. పాత అన్నా క్యాంటీన్ భవన నిర్మాణ పనులను వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలసి పరిశీలించారు. క్యాంటీన్ భవనం సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ప్రహరీగోడ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అదే ప్రాంతంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను లబ్ధిదారులకు అందజేశారు. కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ జిల్లా పరిధిలోని 7 మున్సిపాలిటీల్లో 11 అన్న క్యాంటీన్‌లను పునఃప్రారంభించడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి భవనాల మరమ్మతులు ఈనెల 5వ తేదీలోపు పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. ఆగస్టు 15న రాష్ట్ర వ్యాప్తంగా అన్నా క్యాంటీన్‌లను పునఃప్రారంభించనున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకే 92 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు వెల్లడించారు. అనంతరం పట్టణంలోని విశ్వోదయ కళాశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేశారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్‌రషీద్, డిప్యూటీ తహసీల్దార్ రాంబాబు, ఎంపీపీ తనుజారెడ్డి, ఏఓ విజయలక్ష్మి, ఎంఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ



విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్‌లో మెలకువలు నేర్పుతున్న శిక్షకులు

తిరుపతి సిటీ: విద్యార్థులకు ఆర్చరీ, మార్షల్ ఆర్ట్స్‌లో 15 రోజుల శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించినట్లు జాతీయ సంస్కృత వర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ సేతురామ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణలో అత్యంత ప్రతిభ చూపిన వారికి రాష్ట్రీయ, జాతీయ స్థాయి పోటీల్లో అవకాశం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీన్ రజనీకాంత్ శుక్లా, నోడల్ ఆఫీసర్ దీప్తి, జ్యోతి, వెంకట్రావు, బుల్లీదాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బండరాయిని ఢీకొన్న బస్సు



క్షతగాత్రులను అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న సిబ్బంది

చంద్రగిరి: బండరాయిని కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా, మరో 17 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన భాకరాపేట కనుమలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేకు, కర్ణాటకలోని బాగేపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో తిరుపతికి బయల్దేరింది. భాకరాపేట ఘాట్‌రోడ్డులో గుర్రాలబావి వద్ద బస్సు అదుపు తప్పి పక్కనే ఉన్న బండరాయిని ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ప్రదీప్ కుమార్‌కు తీవ్ర గాయాలు కాగా, బస్సులో ప్రయాణిస్తున్న 17 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న తిరుపతి 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తిరుపతి రుయాకు తరలించార. మరికొంత మంది ప్రైవేటు వాహనాల్లో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లారు. బండరాయిని బస్సు ఢీకొని ఆగిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు సిబ్బందితో కలసి ఘటన స్థలానికి చేరుకుని జేసీబీ సాయంతో బస్సును పక్కకు జరిపి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫోన్‌పే కొట్టు.. సీటు పట్టు!

- సత్యవేడు ఎస్సీ గురుకులంలో సీట్ల విక్రయం
- సెక్యూరిటీ ద్వారా లావాదేవీలు
- విచారణ చేపట్టిన డీసీఓ
- పాఠశాల ఆవరణలో విద్యార్థి సంఘాల ఆందోళన

వరదయ్యపాళెం/సత్యవేడు: సత్యవేడులో షెడ్యూల్డ్ కులాలకు చెందిన బాలికల చదువుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సీటు కావాలంటే ఫోన్‌పే కొట్టాల్సిందే. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సీట్ల కోసం పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారు. గేటు వద్ద సెక్యూరిటీగా ఉండే వ్యక్తి ద్వారా ఈ అక్రమ వసూళ్లను పాఠశాల యాజమాన్యం నడిపించింది. పేద పిల్లలకు కేటాయించిన సీట్లను నగదుకు అమ్ముకోవడం విమర్శలకు దారి తీస్తోంది. ఈ తతంగం గురువారం వెలుగులోకి వచ్చింది.

నియోజకవర్గంలోని బుచ్చినాయుడు కండ్రిగ మండలం నీర్పాకోట గ్రామానికి చెందిన కె.నాగరాజు కుమార్తె కె.నవ్యశ్రీ గురుకుల పాఠశాలలో జూనియర్ ఇంటర్ సీటు కోసం జూన్ 5న దరఖాస్తు చేసుకుంది. పాఠశాలలో సీట్లు ఖాళీ లేవని ప్రిన్సిపల్ ప్రసూన తేల్చి చెప్పడంతో వారు వెనుదిరిగారు. అయితే అక్కడ సీట్లు పొందిన కొందరు నగదు ముట్టజెబితే సీటు వస్తుందన్న విషయం చెప్పేశారు. దీంతో నవ్యశ్రీ తల్లిదండ్రులు పాఠశాలలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న సంగీతను ఆశ్రయించారు. వారి మాటలు విన్న సంగీత మీరు నగదు చెల్లిస్తే పైవారితో మాట్లాడి సీటు ఇప్పిస్తానని వారికి ఆశ చూపింది. దీంతో నవ్యశ్రీతో పాటు వారి సమీప బంధువుల కుమార్తె అవిజ్ఞకు కూడా 8వ తరగతి సీటు కావాలని సెక్యూరిటీకి తెలపగా రెండు సీట్లు ఇప్పిస్తానని వారికి హామీ ఇచ్చింది. అదే సమయంలో సెక్యూరిటీ సంగీతతో సీటు కోసం తల్లిదండ్రులతో కుదిరిన ఒప్పందం మేరకు ఫోన్‌పే ద్వారా నాలుగు విడతలుగా రూ.35వేలు జమ చేశారు. అయితే నెలన్నర నుంచి గురుకుల పాఠశాల చుట్టూ తిరుగుతూ ఉన్నా గడువు చెబుతూ కాలయాపన చేసింది. తీసుకున్న నగదును పైవారికి చెల్లించానని, ఖచ్చితంగా పని అవుతుందని నమ్మబలికింది. అయినా ఎంతకీ సీటు దొరక్కపోవడంతో విద్యార్థిని నవ్యశ్రీ తల్లి సుజాత సెక్యూరిటీ సంగీతను టెలిఫోన్‌లో గట్టిగా నిలదీయడంతో దాట వేసే ధోరణిని అవలంభించింది. అంతేకాక తానే కాదు అనేక మంది కళాశాలలో సీట్లు అమ్ముకుంటున్నారని ఎదురు తిరిగింది. దీంతో బాధిత తల్లిదండ్రులు విషయాన్ని ప్రిన్సిపల్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆ ప్రిన్సిపల్ సమాచారం బయటకు పొక్కనీయకుండా తొక్కిపెట్టే ప్రయత్నం చేశారు. అయితే విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిపోయింది. దీనిపై ప్రిన్సిపల్‌ను సంప్రదించగా అలాంటిదేమీ లేదని, ఇప్పటికే సెక్యూరిటీని తొలగించామంటూ చెప్పుకొచ్చారు.



పాఠశాల ఆవరణలో ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు


కళాశాలలో విచారణ చేస్తున్న డీసీఓ పద్మజ

డీసీఓ విచారణ

గురుకుల కళాశాలలో సీట్ల అక్రమాలపై ఉమ్మడి చిత్తూరు జిల్లా సమన్వయ అధికారిణి (డీసీఓ) పద్మజ గురువారం సాయంత్రం విచారణ చేపట్టారు. కళాశాలకు చేరుకుని విద్యార్థిని నవ్యశ్రీ తల్లిదండ్రుల నుంచి ఫోన్‌పే ద్వారా తీసుకున్న రూ. 35వేల వివరాలను ఆమె పరిశీలించారు. ఈ నగదు అందుకున్న సెక్యూరిటీ గార్డ్ సంగీతను కూడా విచారించారు. ఫోన్‌పే ద్వారా సెక్యూరిటీ గార్డు నగదు అందుకున్నది వాస్తవమేనని నిర్ధారించారు. ఈ నగదును కళాశాల ప్రిన్సిపల్‌కు గానీ, పై అధికారులకు గానీ ఇవ్వలేదని తేల్చారు. అనంతరం డీసీఓ మాట్లాడుతూ గురుకుల కళాశాలలో సీట్ల పంపిణీ పారదర్శకంగానే సాగుతోందంటూ వ్యాఖ్యానించారు. గార్డుగా పనిచేస్తున్న వారికి సీట్ల కేటాయింపులో ఎలాంటి సంబంధం ఉండదన్నారు. ఫోన్‌పే ద్వారా నగదు తీసుకున్న సెక్యూరిటీ గార్డును విచారించి స్టేట్‌మెంట్ నమోదు చేసుకున్నట్లు ఆమె వివరించారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి ప్రభుత్వ కళాశాలపై అప్రతిష్ట పాలు చేసే విధంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. విచారణలో సత్యవేడు ఎంఈఓ రవి, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ ప్రసూన, కమిటీ సభ్యులు వసుమతి, హరిత, అనురాధ, సుభాషిణి, హిమబిందు ఉన్నారు.

సీట్ల విక్రయంపై ఏఐఎస్ఎఫ్ ధర్నా

గురుకుల కళాశాలలో ఖాళీ సీట్లు విక్రయిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు టి.నాగార్జున అరోపించారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ఆ కళాశాల ఆవరణలో ధర్నా చేపట్టారు. నాగార్జున మాట్లాడుతూ గురుకులంలో ఎస్సీ బాలికలకు ఉచితంగా సీట్లు కేటాయించాల్సి ఉండగా, అమ్ముకోవడం ఏంటని ప్రశ్నించారు. గురుకులం సిబ్బంది సెక్యూరిటీ గార్డు ద్వారా డబ్బు తీసుకుని సీట్లు కేటాయిస్తున్నారాని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నియోజక వర్గ సెక్రటరీ టి.మురళి, ఏఐవైఎఫ్ కార్యవర్గ సభ్యుడు సి. మురళి, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూముల పరిశీలన


ఆక్రమిత భూములను పరిశీలిస్తున్న అటవీ శాఖాధికారులు

సాక్షి ఎఫెక్ట్..

చిట్టమూరు(చిల్లకూరు) : చిట్టమూరు మండలం ఆరూరు పంచాయతీ సమీపంలో అటవీ భూములను టీడీపీకి చెందిన కొంత మంది ఆక్రమించుకుని, యంత్రాలతో చదును చేయడం ఆరంభించారు. గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 432లో ఉన్న సుమారు 400 ఎకరాలను చదును చేశారు. దీనిపై సాక్షి గురువారం అటవీ భూముల ఆక్రమణకు టీడీపీ నేత యత్నం అనే శీర్షికన కథనం ప్రచురించింది. స్పందించిన నాయుడుపేట అటవీ శాఖ అధికారులు ఆక్రమిత భూములను పరిశీలించారు. చదును చేసిన ప్రాంతానికి కొంత దూరంలో అటవీ శాఖ గతంలో ట్రెంచ్ ఏర్పాటు చేయడాన్ని పరిశీలించారు. సెక్షన్ అధికారి కోటేశ్వరరావు, చిల్లమూరు బీట్ ఆఫీసర్ ఉస్సేసా మాట్లాడుతూ ఆరూరు ప్రాంతంలో భూములు ఆక్రమణలకు గురైన విషయం వాస్తవమేనని అయితే అవి అటవీ శాఖ భూములు కాదని వైల్డ్ లైఫ్‌కు చెందిన భూములతో పాటుగా పులికాట్ సరస్సు ప్రాంతానికి చెందినవని చెప్పారు. సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి రక్షణ కల్పించేలా చూస్తామన్నారు.

బాల కార్మికులను బడిలో చేర్పిద్దాం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్: బాల కార్మికులను బడిలో చేర్పిద్దామని కార్మికశాఖ తిరుపతి ఉప కమిషనర్ డీవీ రంగరాజు పేర్కొన్నారు. ఆయన గురువారం కలెక్టరేట్‌లో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. రంగరాజు మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకు బాల కార్మికుల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 14ఏళ్ల లోపు పిల్లలు బాల కార్మికులుగా పనిచేస్తుంటే వారిని గుర్తించి బడికి పంపడానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అన్ని విభాగాలకు చెందిన అధికారులు సహకరించాలని కోరారు. ఆ మేరకు ప్రత్యేక డ్రైవ్‌కి చెందిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పోలీస్‌శాఖలో హోంగార్డు కీలకం


దర్బార్ నిర్వహిస్తున్న కమాండెంట్ మహేష్ కుమార్

తిరుపతి క్రైమ్: పోలీస్ శాఖలో అన్ని విభాగాల కన్నా హోంగార్డే చాలా కీలకమని రాయలసీమ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్ కుమార్ తెలిపారు. తిరుపతి పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో గురువారం హోంగార్డ్స్ పరేడ్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పరేడ్ అనంతరం హోంగార్డులను ప్రోత్సహిస్తూ జిల్లాలో ఇటీవల పదోన్నతి పొందిన 73 మంది హోంగార్డులకు డీఎస్పీ చిరంజీవి రూపొందించిన జ్ఞాపికలను మహేష్ కుమార్ సర్దార్ అందజేశారు. కమాండెంట్ మాట్లాడుతూ, ఉద్యోగంలో చేరే ముందు శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఎప్పుడూ గుర్తు చేసుకుంటూ ఉండాలని సూచించారు. ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ భీమా పీఎంజేజేబీవై, పీఎంఎస్బీవై పాలసీలను ఎప్పటికప్పుడు రెన్యువల్ చేసుకుంటూ ఉండాలని తెలిపారు. అనంతరం దర్బార్ నిర్వహించి హోంగార్డుల సమస్యలను అడిగి పరిష్కరించారు. కార్యక్రమంలో హోంగార్డ్ డీఎస్పీ చిరంజీవి, ఆర్ఐ పోతుల రాజు, ఆర్ఎస్సీలు, ఏఆర్ ఎస్ఐలు పాల్గొన్నారు.

విదేశీ విద్యపై అవగాహన సదస్సు రేపు


సమావేశంలో మాట్లాడుతున్న ఐసీసీ సీఈవో నరసింహ బందార్ల

తిరుపతి కల్చరల్: విదేశాల్లో విద్య, ఉపాధి అవకాశాలపై ఈ నెల 3న కెన్సెస్ హోటల్లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఇంటర్నేషనల్ క్యాంపస్ కనెక్ట్ వ్యవస్థాపక సీఈవో నరసింహ బందార్ల తెలిపారు. ఆయన గురువారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ, గ్లోబల్ ఎడ్యుకేషనల్ ఫెయిర్–2024 పేరుతో శనివారం నిర్వహించే ఈ సదస్సుకు 100 విదేశీ విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. విదేశాల్లో ఎంపిక చేసుకునే కోర్సు, ఆయా దేశాల పరిస్థితులపై ఆందోళనలు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఎంపిక చేసుకునే కోర్సుకు తగిన యూనివర్సిటీ అక్కడ బోధన, వాతావరణ పరిస్థితుల గురించి ప్రతినిధులు తెలియజేస్తారని తెలిపారు. అంతేకాక ఈ ఫెయిర్‌కు విచ్చేసే విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు విదేశీ విద్యకు రుణాల మంజూరుపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆయనతో పాటు ఐసీసీ గ్లోబల్ హెడ్ శిరీష్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో ఉద్యోగులు

- ఆగిన సచివాలయ సేవలు
- గ్రామాల్లో కూటమి నేతల హడావుడి
- ప్రభుత్వం కాదు.. టీడీపీ ఇచ్చినట్టు చెబుతున్న నేతలు


తిరుపతి నగరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

తిరుపతి అర్బన్: జిల్లాలో గురువారం పింఛన్ల పంపిణీలో పలుచోట్ల ప్రజాప్రతినిధులు కాని టీడీపీ కూటమి నేతలు పాల్గొన్నారు. మరోవైపు ఉద్యోగులంతా పంపిణీలో నిమగ్నమయ్యారు. జిల్లావ్యాప్తంగా క్షేత్రస్థాయి నుంచి నియోజకవర్గస్థాయి వరకు ప్రజాప్రతినిధులు కాని టీడీపీ కూటమి నేతలు పింఛన్లను పంపిణీ చేశారు. వారి వ్యవహారం ప్రభుత్వం నుంచి ఇస్తున్నట్లు కాకుండా టీడీపీ కార్యాలయం నుంచి నగదు పంపిణీ చేసినట్లు హడావుడి చేశారు. "అంతా గుర్తుపెట్టుకోండి.. పింఛన్లు సీఎం చంద్రబాబునాయుడు ఇస్తున్నారు.." అంటూ ప్రచారం చేశారు. అయితే ఎక్కడా ఈ నెలలో 1,390 మందికి పింఛన్లు తొలగించిన మాట గుర్తుచేయకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. మొత్తంగా తొలిరోజే అధిక శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు చూపాలన్న ఉద్దేశంతో 100శాతం సచివాలయ ఉద్యోగులను ఉపయోగించారు. పలుచోట్ల సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటి వద్ద కాకుండా అందరినీ ఒక ప్రాంతానికి పిలిపించి పింఛన్ల నగదు అందజేశారు. దీంతో సచివాలయాల్లో సేవలు ఆగిపోయాయి. ప్రధానంగా సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు ఇబ్బందులుపడ్డారు. మొత్తంగా వలంటీర్లు లేకున్నా పింఛన్లు ఇచ్చామని చూపించడానికి ఉద్యోగులు అందరినీ వినియోగించుకున్నారు. గురువారం ఉదయం 6 గంటలకు, 10.30 గంటల సమయంలో జిల్లాలో సర్వర్లు మొరాయించడంతో పంపిణీలో జాప్యం చోటుచేసుకుంది.

కలెక్టర్ పర్యవేక్షణ

కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పింఛన్ల పంపిణీ పర్యవేక్షణలో భాగంగా గురువారం జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల సుడిగాలి పర్యటన చేపట్టారు. తొలిరోజు 99 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభావతి సైతం పింఛన్ల పంపిణీని వేగవంతం చేయాలని సిబ్బందిని అప్రమత్తం చేశారు. మొత్తం మీద గురువారం 97.58 శాతం మందికి పింఛన్ల అందజేశారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

తిరుపతి లీగల్ : ఓ హత్య కేసులో అనంతపురం జిల్లా, గుంతకల్లు, మిల్లు ఏరియా, శ్రీలంక కాలనీకి చెందిన ఆర్ముగం మణిరత్నం అలియాస్ రాముకు జీవిత ఖైదు, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు జిల్లా జడ్జి అర్చన గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు, కష్ణాజిల్లా విజయవాడ, గవర్నర్ పేట, అలీబేగ్ వీధికి చెందిన రేపాక లక్ష్మణరావుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన తన పూర్వీకుల ఆస్తులను అమ్మి ముగ్గురు కుమార్తెలకు వివాహాలు చేశారు. ఆయన వివిధ ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ జీవించేవాడు. అప్పుడప్పుడూ తన ఇంటికి వచ్చి వెళ్లేవాడు. కొన్నేళ్ల క్రితం తిరుపతికి చేరుకున్నాడు స్థానిక శ్రీ పద్మావతి అతిథి గృహం సమీపంలోని బస్టాప్ వద్ద రాత్రిపూట నిద్రించేవాడు. నిందితుడు మణిరత్నం మద్యం, గంజాయి వంటి చెడు అలవాట్లకు బానిసై, దేవాలయాలు, మసీదులలో దొంగతనాలు చేసేవాడు. మూడు హత్య కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. అతనికి మృతుడు లక్ష్మణరావుకు బస్టాప్‌లో నిద్రించే సమయంలో పరిచయం ఏర్పడింది. 2022 నవంబర్ 15వ తేదీ ఉదయం లక్ష్మణరావును అగ్గిపెట్టె కావాలని నిందితుడు మణిరత్నం అడిగాడు. దీంతో ఆయన మణిరత్నాన్ని దుర్భాషలాడాడు. మణిరత్నంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని లక్ష్మణరావు బెదిరించాడు. దీంతో మణిరత్నం భయపడి అక్కడి నుంచి వెళ్లిపోయినా, లక్ష్మణరావుపై కక్ష పెంచుకున్నాడు. అదే రోజు రాత్రి బస్టాప్‌లో అరుగుపై లక్ష్మణరావు నిద్రిస్తుండగా నిందితుడు మణిరత్నం ఓ బండరాయి తీసుకుని అతని తలపై, ముఖంపై దాడి చేశాడు. తీవ్ర రక్త గాయాలతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితుడు మణిరత్నం అక్కడి నుంచి పరారయ్యాడు. తిరుపతి వీఆర్వో నక్క చలపతి ఫిర్యాదు మేరకు ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడు మణిరత్నంను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం అతనిపై రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడు మణిరత్నంకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ విజయలక్ష్మి వాదించారు.

షిరిడీ యాత్ర విజయవంతం

- బాబా దర్శనం పూర్తి చేసుకున్న 2 వేల మంది చంద్రగిరి వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- షిరిడీ నుంచి తిరుపతి బయలు దేరిన ప్రత్యేక రైలు


సాయిబాబా ఆలయం వద్ద పార్టీ శ్రేణులతో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు అందరితో కలిసి నాలుగు రోజుల పాటు చెవిరెడ్డి చేపట్టిన షిరిడీ యాత్ర విజయవంతం అయ్యింది. ప్రతి సంవత్సరం ఏదో ఒక పుణ్యక్షేత్రానికి తన కుటుంబ సభ్యులైన పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరినీ దైవ దర్శనానికి తీసుకునివెళ్లి రావడం చెవిరెడ్డి ఆనవాయితీ. ఇందులో భాగంగానే ఈ ఏడాది షిరిడీ యాత్రకు శ్రీకారం చుట్టారు. తన కుటుంబ సభ్యులతో పాటు పార్టీ నేతలు, కార్యకర్తలతో కలసి సరదాగా మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచినప్పుడు మాత్రమే కాదు.. ఓడినా సరే మీ చేయి నేను వదలను అంటూ పార్టీ శ్రేణులకు సంకేతాలను పంపారు. నాలుగు రోజుల పాటు సాగిన షిరిడీ యాత్రలో ఎలాంటి ఇబ్బందులూ ఎదురుకాకుండా విజయవంతం అయింది. తిరుపతిలో బయలుదేరినప్పటి నుంచి తిరిగి వచ్చేంత వరకు సకల సౌకర్యాలు కల్పించిన చెవిరెడ్డికి పార్టీ శ్రేణులు కృతజ్ఞతలు తెలిపాయి. చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా పదేళ్ల పాటు ప్రజాసేవ చేసిన చెవిరెడ్డి తన పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలసి నాలుగు షిరిడీ యాత్ర చేపట్టారు.

24 బోగీలు.. 2 వేల మంది పార్టీ నేతలు

గత నెల 30న తిరుపతి నుంచి షిరిడీ యాత్రకు బయలుదేరిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి ఒక ప్రత్యేక రైలును సిద్ధం చేశారు. 24 బోగీల్లో 2వేల మంది పార్టీ నేతలు, కార్యకర్తలతో పాటు చెవిరెడ్డి సతీమణి లక్ష్మి, ఆయన కుమారులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి కూడా వెళ్లారు.

చోరీ కేసులో ముగ్గురికి జైలు

తిరుపతి లీగల్ : ద్విచక్ర వాహనం చోరీ కేసులో ముగ్గురికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు గురువారం తీర్పు చెప్పారు. గుర్రంకొండ మండలం దిగువ తోటివారి పల్లెకు చెందిన చెన్నూరి ప్రకాష్, నెల్లూరు నవాబ్ పేట, సెట్టిగుంట రోడ్డుకు చెందిన గణేష్ సుబ్బారెడ్డి, అన్నమయ్య జిల్లా, కలకడ పోస్టాఫీస్ వీధికి చెందిన ఎం అక్బర్ బాషా గత ఏడాది మే 10న స్థానిక రైల్వే హాలిడే హోమ్ వద్ద ద్విచక్ర వాహనాన్ని అపహరించారు. ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. నిందితులు చెన్నూరి ప్రకాష్ గణేష్ సుబ్బారెడ్డికి 11 నెలలు జైలు శిక్ష, అక్బర్ బాషాకు 12 నెలలు జైలు శిక్ష, రూ.100 జరిమానా విధించారు.

పోక్సో కేసులో వృద్ధుడి అరెస్టు

చిల్లకూరు: ఆరేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన వృద్ధుడిని పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని ఎగువరాజుపాళెంలో గత నెల 26న చిన్నారిపై లైంగిక దాడి చేసిన ఏలూరు వెంకటయ్యపై గత నెల 30న పోక్సో కేసు నమోదు చేశారు. ఈ మేరకు గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి గురువారం వెంకటయ్యను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ సుధీర్ కుమార్ తెలిపారు.



